
ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



వికారాబాద్ - మేడ్చల్

జిల్లాల వార్తలు

5

ఆదివారం 7 ఏప్రిల్ 2024



రంజాన్ వేళలు

ఇఫ్తార్ - ఆదివారం

సాయంత్రం - 6:36

సహర్ - సోమవారం

ఉదయం - 4:42



సభకు హాజరైన జనం

జన జాతర

తుక్కుగూడ సభకు పోటెత్తిన జనం

పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో అధికార కాంగ్రెస్ పార్టీ శనివారం తుక్కుగూడలో నిర్వహించిన 'జనజాతర' బహిరంగ సభ విజయవంతమైంది. రాష్ట్ర నలుమూలల నుంచి కాంగ్రెస్ శ్రేణులు లక్షలాదిగా తరలివచ్చారు. దీంతో తుక్కుగూడలో ఎక్కడ చూసినా జనసందడే కనిపించింది. అశేషజనం తరలిరావడంతో తుక్కుగూడ రోడ్లన్నీ జనసంద్రాన్ని తలపించాయి. పార్టీ అగ్రనేత రాహుల్ గాంధీ సభా వేదికకు వచ్చే సమయానికే ప్రాంగణం జనంతో కిక్కిరిసింది. దీంతో రోడ్ల మీదే వేలాదిగా జనం ఉండిపోయారు. పార్టీ జాతీయ మేనిఫెస్టో తెలుగు ప్రతిని రాజీవ్ గాంధీ సభా ప్రాంగణం వేదిక నుంచే రాహుల్ గాంధీ విడుదల చేశారు. సభకు అంచనాలకు తగ్గట్టుగా జనం హాజరుకావడంతో కాంగ్రెస్ నేతలు సంబరపడుతున్నారు.

లోక్‌సభ ఎన్నికల శంఖారావాన్ని పూరించిన కాంగ్రెస్

- హాజరైన అగ్రనేతలు ఖర్గే, రాహుల్, సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి
- జాతీయ మేనిఫెస్టో విడుదల
- కిలోమీటర్ల మేర ట్రాఫిక్ జామ్
- ఉత్సాహాన్ని నింపిన నేతల ప్రసంగాలు

రంగారెడ్డి అర్బన్/మహేశ్వరం/ఇబ్రహీంపట్నం/మొయినాబాద్/షాద్‌నగర్, ఏప్రిల్ 6 : రంగారెడ్డిజిల్లా మహేశ్వరం మండలం తుక్కుగూడలో శనివారం కాంగ్రెస్ పార్టీ నిర్వహించిన జనజాతర భారీ బహిరంగ సభ విజయవంతమైంది. ఈ సభకు జనం జేజేలు పలికారు. రాష్ట్రం నలుమూలల నుంచి తండోపతండాలుగా తరలివచ్చారు. పార్టీ అగ్రనేత రాహుల్‌గాంధీ హాజరు కావడంతో ప్రత్యేకత సంతరించుకుంది. ఆయనతో పాటు పలువురు జాతీయ నేతలు, ఇతర రాష్ట్రాల ముఖ్యనాయకులు, సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎంపీ అభ్యర్థులు పాల్గొన్నారు. 2023 అసెంబ్లీ ఎన్నికల ముందు తుక్కుగూడలో జరిగిన సభలోనే ఆ పార్టీ అగ్రనేత సోనియా గాంధీ ఆరు గ్యారంటీలను ప్రకటించారు. ఈ గ్యారంటీలకు ప్రజల్లో మంచి స్పందన రావడంతో పాటు, పార్టీ అధికారంలోకి వచ్చింది. అదే సెంటిమెంట్‌ను కొనసాగిస్తూ.. లోక్‌సభ ఎన్నికల శంఖారావాన్ని పూరించింది. ఇక్కడి నుంచి ఎన్నికల ప్రచారాన్ని ప్రారంభించింది. ఈనెల 5న పార్టీ జాతీయ మేనిఫెస్టో డిల్లీలో సోనియా, ఖర్గే, రాహుల్ విడుదల చేశారు. అందుకు సంబంధించి తెలుగుప్రతిని

మిగతా 7వ పేజీలో ...



జనజాతర సభకు తరలుతున్న కార్యకర్తలు



కాంగ్రెస్ చెప్పిందే చేస్తుంది

బడంగ్‌పేట్ మేయర్ చిగురింత పారిజాత

కాంగ్రెస్ చెప్పిందే చేస్తుందని బడంగ్‌పేట్ మేయర్ చిగురింత పారిజాతనర్సింహారెడ్డి అన్నారు. కాంగ్రెస్ పార్టీని కొంతమంది బీఆర్ఎస్, బీజేపీ నాయకులు హేళన చేస్తున్నారని, పదేళ్లు దేశంలో, రాష్ట్రంలో అధికారంలో ఉన్నా ఏమి చేశారని ప్రశ్నించారు. ప్రజలను తప్పుదోవ పట్టించేందుకు లేనిపోని మాటలు మాట్లాడితే ఊరుకునే ప్రసక్తి లేదని హెచ్చరించారు. జనజాతర సభ ద్వారా దేశంలో కాంగ్రెస్ అధికారంలోకి రావడం ఖాయమన్నారు.



సభకు వస్తున్న మహిళలు




14 ఎంపీ సీట్లు సోనియమ్మకు బహుమతిగా ఇద్దాం : మాజీ ఎమ్మెల్యే కేఎల్లార్

కేసీఆర్ తెలంగాణ ప్రజలను మోసం చేసిండని మేడ్చల్ మాజీ ఎమ్మెల్యే కిచ్చన్నగారి లక్ష్మారెడ్డి అన్నారు. తుక్కుగూడలో జనజాతర సభ జరపడం ఎంతో అదృష్టంగా భావిస్తున్నానని తెలిపారు. ఇటీవల జరిగిన శాసన సభ ఎన్నికల్లో కేసీఆర్‌కు ప్రజలు బుద్ధి చెప్పారని, రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపికి బుద్ధి చెప్పేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని తెలిపారు. ఇన్నాళ్లు ఫాంహౌస్‌లో పడుకున్న కేసీఆర్‌కు మళ్లీ ఎంపీ ఎన్నికలు రావడంతో రైతులు గుర్తుకు వచ్చారని విమర్శించారు. తెలంగాణలోని 17 పార్లమెంట్ నియోజవర్గాల్లో కాంగ్రెస్ అభ్యర్థులను భారీ మెజారిటీలో గెలిపించాలని కోరారు. ఎంపీ ఎన్నికల తర్వాత బీఆర్ఎస్ లేకుండా పోతుందన్నారు. మాటిస్తే.. మడమ తిప్పం... ఆరు గ్యారంటీలు ఇచ్చాం.. అమలు చేస్తున్నాం. తెలంగాణలో 14 ఎంపీ సీట్లు గెలిపించి సోనియమ్మకు బహుమతిగా ఇద్దామని పిలుపునిచ్చారు.



కాంగ్రెస్ పార్టీకి ఓటు వేయకుంటే అభివృద్ధి వెనక్కి: మల్కాజ్‌గిరి ఎంపీ అభ్యర్థి పట్నం సునీతారెడ్డి

కార్యకర్తలే కాంగ్రెస్ పార్టీకి పట్టుకొమ్మలని మల్కాజిగిరి ఎంపీ అభ్యర్థి పట్నం సునీతా మహేందర్‌రెడ్డి అన్నారు. గత ప్రభుత్వ పాలనలో కార్యకర్తలు ఎన్నో అవమానాలు భరించారన్నారు. మల్కాజిగిరి ప్రజలను కోరేది ఏమిటంటే.. నన్ను నాన్‌లోకల్ అంటున్నారు. నేను నాన్‌లోకల్ కాదు.. ఉమ్మడి రంగారెడ్డి జిల్లా జడ్పీ ఛైర్‌పర్సన్‌గా ఉన్నాను. వేల కోట్లతో జిల్లాను అభివృద్ధి చేశానని చెప్పారు. 2006లో నేను చేసిన అభివృద్ధి ఎంతో ఉందన్నారు. ఒక్కసారి అవకాశమివ్వాలని, అందుబాటులో ఉండి సేవ చేస్తానన్నారు. మల్కాజిగిరి నియోజకవర్గ సమస్యలు పరిష్కరిస్తాని చెప్పారు. కాంగ్రెస్ పార్టీకి ఓటు వేయకుంటే.. అభివృద్ధి పదేళ్ల వెనక్కి వెళ్తుందన్నారు.



మరోసారి అవకాశం ఇవ్వండి : చేవెళ్ల ఎంపీ రంజిత్‌రెడ్డి

మరోసారి అవకాశం ఇవ్వండి.. అభివృద్ధితో పాటు విద్య, వైద్యం, సంక్షేమానికి పెద్దపీట వేస్తానని చేవెళ్ల ఎంపీ రంజిత్‌రెడ్డి అన్నారు. 75ఏళ్ల స్వాతంత్య్రం తరువాత పేదల సంక్షేమం గురించి ఆలోచించిన పార్టీ కాంగ్రెస్ పార్టీ అని, సంక్షేమానికి పెద్ద పీట వేస్తుందన్నారు. పేదల సంక్షేమం వద్దూ.. కార్పొరేట్ సంక్షేమం ముద్దు అని బీజేపీ అంటుందని తెలిపారు. చేవెళ్ల గడ్డపై కూరగాయల నుంచి సాఫ్ట్‌వేర్ వరకు ఉత్పత్తి అవుతున్నాయని తెలిపారు. మరోసారి మీ ముందు నిలబడ్డా.. ఎంపీగా గెలిపించాలని కోరారు.





కాంగ్రెస్‌తోనే సెక్యులరిజం సాధ్యం : మాజీ మంత్రి షబ్బీర్ అలీ

కాంగ్రెస్‌లో సెక్యులరిజం సాధ్యమని మాజీ మంత్రి షబ్బీర్‌అలీ అన్నారు. దేశంలో సెక్యులరిజం కాపాడేది ఒక్క కాంగ్రెస్ పార్టీయేనన్నారు. పదేళ్ల బీజేపీ పాలనలో మత విద్వేషాలను రెచ్చగొట్టారని, వాటిని రాహుల్ పాదయాత్ర ద్వారా రూపుమాపారన్నారు. అంబేద్కర్ ఆశయాలను బీజేపీ తుంగలో తొక్కిందన్నారు. కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తేనే ముస్లింలకు రక్షణ ఉంటుందన్నారు.



విర్రవీగుతున్న కేసీఆర్‌కు బుద్ధి చెప్పారు : భువనగిరి ఎంపీ అభ్యర్థి శ్యామల కిరణ్‌కుమార్‌రెడ్డి

విర్రవీగుతున్న కేసీఆర్‌కు ప్రజలు బుద్ధి చెప్పారని భువనగిరి ఎంపీ అభ్యర్థి శ్యామల కిరణ్‌కుమార్‌రెడ్డి అన్నారు. శాసనసభ ఎన్నికల్లో కేసీఆర్‌ను ఎలా తరిమి కొట్టారో ఆలాగే ప్రధాని మోదీని తరిమి తరిమికొట్టాలని పిలుపు నిచ్చారు. తెలంగాణలో 15 ఎంపీ స్థానాలను గెలుచుకోవాలని, బీఆర్ఎస్‌ను, బీజేపీని బొందపెట్టాలని పిలుపునిచ్చారు.

సమన్వయంతో... ముందుకు

- స్పీకర్, ఎమ్మెల్యేలతో సమన్వయం చేసుకుంటూ..
- ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా సాగుతున్న కాంగ్రెస్
- అంతర్గత సమస్యల పరిష్కారానికి నేతల చొరవ

వికారాబాద్, ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి) : చేవెళ్ల పార్లమెంట్ నియోజకవర్గంపై కాంగ్రెస్ జెండాను ఎగరేయడమే లక్ష్యంగా పార్టీ నేతలు రంగంలోకి దిగారు. జిల్లాలోని చేవెళ్ల నియోజకవర్గ పరిధిలోకొచ్చే వికారాబాద్, పరిగి, తాండూరు నియోజకవర్గాల్లో సత్తాచాటేలా కాంగ్రెస్ శ్రేణులు పనిలోకి దిగాయి. నాయకులు, కార్యకర్తలను సమన్వయం చేసుకుంటూ ఐక్యత సాధన దిశగా ముందుకు సాగుతున్నారు. పార్టీలో అంతర్గత సమస్యలు, అలకలను గుర్తించిన పార్టీ అభ్యర్థి రంజిత్‌రెడ్డి ఎప్పటికప్పుడు పరిష్కరించుకుంటూ ముందుకు సాగుతున్నారు. తాజాగా వికారాబాద్‌తో పాటు మరికొన్ని ప్రాంతాల్లో నిర్వహించిన సమావేశాల్లో కొందరు నాయకులు అసంతృప్తి వ్యక్తం చేసిన విషయం తెలిసిందే. అధిష్టానం నిర్ణయాన్ని స్వాగతిస్తానే.. గతంలో తమకు ఎదురైన కొన్ని అనుభవనాలను వారు ప్రస్తావించగా.. ఏ పరిస్థితుల్లో అలాంటి నిర్ణయాలు తీసుకున్నామో వివరిస్తూ.. రాబోయే రోజుల్లో అలాంటివి పునరావృతం కాకుండా చూస్తామంటూ రంజిత్‌రెడ్డి శ్రేణులకు భరోసా ఇస్తున్నారు.

పార్టీలకు అతీతంగా పనులు చేసుకున్నామని ..

తాను కాంగ్రెస్‌లోకి కొత్తగా వచ్చినా.. తాను అందరి వాడిననే విషయాన్ని ఎంపీ గుర్తు చేస్తున్నారు. బీఆర్ఎస్‌లో కొనసాగిన సమయంలో పార్టీలకతీతంగా అందరితో ఎలా కలుపుగోలుగా ఉండి సమస్యల పరిష్కారానికి ఎలా కృషిచేశామనేది వివరిస్తున్నారు. చేవెళ్ల నియోజకవర్గంపై కాంగ్రెస్ జెండా ఎగరేయాలని సీఎం రేవంత్‌రెడ్డి పట్టుదలతో ఉన్న విషయం తెలిసిందే. క్షేత్రస్థాయిలో అందరి అభిప్రాయాలు, సర్వేల ఆధారంగానే పార్టీ అధిష్టానం ఎంపీ అభ్యర్థులను నిర్ణయించిందని, ఈ క్రమంలోనే చేవెళ్ల నుంచి రంజిత్‌రెడ్డిని ఖరారు చేశామని, అన్ని రకాలుగా ఆలోచించే చేవెళ్లలో బరిలో దింపిన రంజిత్‌రెడ్డిని గెలిపించాల్సిన బాధ్యత నాయకులు, కార్యకర్తలు తీసుకోవాలని సీఎం రేవంత్‌రెడ్డి స్పష్టం చేయడంతో ఆ దిశగా సమన్వయం చేసుకుంటూ ముందుకు సాగుతున్నారు. ఈ నియోజకవర్గంపై ఇటీవల ఆయన సమీక్ష నిర్వహించి నేతలకు దిశానిర్దేశం చేశారు. పార్టీలో ఎలాంటి మనస్పర్థలు లేకుండా కలిసికట్టుగా పనిచేయాలని, రంజిత్‌రెడ్డిని ఎంపీగా గెలిపించాలని సీఎం ఆదేశించిన విషయం తెలిసిందే. చేవెళ్లలో కాంగ్రెస్ జెండా ఎగరవేస్తేనే ఆ తరువాత అందరి సమస్యలు పరిష్కారమవుతాయని స్పష్టం చేశారు. చేవెళ్ల పార్లమెంట్ నియోజకవర్గ ఇన్‌ఛార్జిగా ప్రభుత్వ సలహాదారు వేం నరేందర్‌రెడ్డిని అధిష్టానం నియమించింది. పార్లమెంట్ నియోజకవర్గం పరిధిలోకి వచ్చే ఏడు నియోజకవర్గాల్లోనూ కాంగ్రెస్ మరింత దూకుడుగా ముందుకు సాగాలంటూ రేవంత్‌రెడ్డి పార్టీ ముఖ్య నాయకులకు సూచించిన విషయం తెలిసిందే. రంజిత్‌రెడ్డి పార్టీ శ్రేణులతో ఎప్పటికప్పుడు సమావేశమవుతూ ఎన్నికల్లో అనుసరించాల్సిన వ్యూహాలపై చర్చిస్తున్నారు. వికారాబాద్ నియోజకవర్గం నుంచి ప్రాతినిథ్యం వహిస్తున్న స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ తన నియోజకవర్గంతో పాటు పార్లమెంట్ పరిధిలోకి వచ్చే ఇతర నియోజకవర్గాల నాయకులతోనూ సమీక్షలు నిర్వహిస్తూ చేవెళ్ల లోక్‌సభ స్థానంలో కాంగ్రెస్ గెలిచేలా పార్టీ శ్రేణులు ఐక్యంగా ముందుకు సాగేందుకు సమన్వయం చేస్తున్నారు.



పాఠశాలల్లో మౌలిక వసతుల పనులపై ప్రణాళిక రూపొందించాలి



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ గౌతమ్

మేడ్చల్, ఏప్రిల్ 6(ఆంధ్రజ్యోతి): అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీలతో పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పనపై క్షేత్రస్థాయిలో పరిశీలించి నివేదికలు త్వరగా అందజేయాలని కలెక్టర్ గౌతమ్ సంబంధిత అధికారులను ఆదేశించారు. శనివారం కలెక్టరేట్‌లో ఈఈ పీఆర్, ఈఈ ఆర్‌అండ్‌బీ, ఎంపయూడీ ఆర్‌డబ్ల్యూఎస్, ఈడబ్ల్యూఐడీసీ అధికారులతో నిర్వహించిన సమావేశంలో కలెక్టర్ మాట్లాడారు. వసతులు కల్పించాల్సిన పాఠశాలలను సందర్శించి పనులకు ఎస్టిమేషన్ రూపొందించి వెంటనే పంపాలని ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. ప్రభుత్వ పాఠశాలల్లో తాగునీటి సౌకర్యం, తరగతి గదుల్లో మేజర్, మైనర్ మరమ్మతులు, టాయిలెట్ మరమ్మతులు, బాలికలకు అదనపు టాయిలెట్లు నిర్మాణం, విద్యుత్ సౌకర్యం, పెయింటింగ్ వంటి పనుల వ్యయ అంచనాలను తయారు చేసి పంపాలని సూచించారు. పాఠశాలలను తనిఖీ చేసి ప్రతిపాదనలు పక్కాగా రూపొందించాలన్నారు. అన్ని పనులను అమ్మ ఆదర్శ కమిటీల ద్వారానే పూర్తిచేయాలన్నారు. ప్రతిపాదించిన నిధులను ప్రభుత్వం ఇస్తుందని, వాటిని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఏయే పాఠశాలల్లో ఏ పనులు చేపట్టాలో అధికారులను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ అభిషేక్‌అగస్త్య, డీఈవో విజయకుమారి, డీఆర్‌డీఏ పీడీ సాంబశివరావు, మెప్మా అధికారి అనిల్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

తాగునీటి సరఫరాలో ఇబ్బందులు తలెత్తనీయొద్దు

- జిల్లా ప్రత్యేకాధికారి విజయేంద్ర



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా ప్రత్యేకాధికారి విజయేంద్ర

మేడ్చల్, ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి) : తాగునీటి సరఫరాలో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా కార్యాచరణ చేపట్టాలని, జిల్లాకు ప్రత్యేక అధికారిగా నియమితులైన రాష్ట్ర రవాణా, ఆర్ అండ్‌బీ శాఖ స్పెషల్ సెక్రటరీ విజయేంద్ర అధికారులకు సూచించారు. శనివారం కలెక్టరేట్‌లో కలెక్టర్ గౌతమ్‌తో కలిసి తాగునీటి సరఫరాపై మున్సిపల్ కమిషనర్లు, మండల ప్రత్యేకాధికారులు, మిషన్ భగీరథ, ఆర్‌డబ్ల్యూఎస్ ఇంజినీర్లు, ఎండీఓలతో ఆమె సమీక్ష సమావేశం నిర్వహించారు. క్షేత్రస్థాయిలో తాగునీటి సరఫరా పరిస్థితిపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఆమె మాట్లాడుతూ తాగునీటి సరఫరాలో ఎలాంటి ఇబ్బందులొచ్చినా వెంటనే చర్యలు చేపట్టాలన్నారు. ప్రత్యామ్నాయ చర్యలతో నీటిఎద్దడిని నివారించాలన్నారు. చేతి పంపులు, బోరు మోటార్లు, పైప్‌లైన్ల మరమ్మతులు చేయించాలన్నారు. అన్ని వనరులను వినియోగించుకోవాలని సూచించారు. టోల్ ఫ్రీ కాల్‌సెంటర్ నంబర్లు ప్రజలకు తెలియజేయాలన్నారు. అధికారులు, సిబ్బంది సమన్వయంతో పనిచేస్తూ వేసవిలో నీటి సమస్య రాకుండా చూడాలన్నారు. కలెక్టర్ గౌతమ్ మాట్లాడుతూ ప్రజలకు తాగునీటి సమస్య రాకుండా చూసే బాధ్యత మనందరిది అన్నారు. సమావేశంలో అదనపు కలెక్టర్ అభిషేక్‌అగస్త్య, సీఈవో దిలీప్‌కుమార్, డీపీవో వెంకటయ్య, డీఆర్డీఏ పీడీ సాంబశివరావు, మున్సిపల్ కమిషనర్లు పాల్గొన్నారు.

రారెత్తిస్తున్న ఎండలు

- కందుకూరులో 42.8 డిగ్రీల నమోదు



వికారాబాద్, ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి) : ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలో అత్యధిక ఉష్ణోగ్రతలు నమోదవుతుండడంతో ప్రజలు బెంబేలెత్తుతున్నారు. ఉదయం 9గంటలకే ఎండ తీవ్రత పెరగడంతో ప్రజలకు ఇక్కట్లు తప్పడం లేదు. ఉదయం 11 నుంచి సాయంత్రం 4గంటల వరకు రోడ్లపైకి వచ్చేందుకు భయపడుతున్నారు. శనివారం రంగారెడ్డి జిల్లా కందుకూరులో 42.8డిగ్రీలు, వికారాబాద్ జిల్లా తాండూరులో 42.7, మేడ్చల్-మల్కాజ్‌గిరి జిల్లా మేడిపల్లిలో 42.6డిగ్రీలు, యాలాలలో 42.5డిగ్రీలు, పుట్టపహాడ్‌లో 42.4, బొంరాస్‌పేట్‌లో 42.2, కోట్‌పల్లిలో 42.1డిగ్రీల చొప్పున ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి.

మెడికల్ కాలేజీలో పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

మేడ్చల్, ఏప్రిల్ 6(ఆంధ్రజ్యోతి ప్రతినిధి): మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాకు మంజూరైన కొత్త మెడికల్ కాలేజీలో 32 పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ విడుదలైంది. డీఎంహెచ్‌వో రఘునాథస్వామి తెలిపిన వివరాల ప్రకారం మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా అధికారిక వెబ్‌సైట్‌లో ఈనెల 6 నుంచి 8 వరకు డౌన్‌లోడు చేసుకుని, మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా వైద్యఆరోగ్య శాఖ అధికారి పేర రూ.500లు డి.డి చెల్లించి అర్హత పత్రాలతో కలెక్టరేట్‌లో సమర్పించాలన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న డీఆర్‌డీవో శ్రీనివాస్

'ఉపాధి' కల్పనకు అవగాహన కల్పించాలి

తాండూరురూరల్, ఏప్రిల్ 6: మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకంలో భాగంగా రైతులు, కూలీలకు ఉపాధి కల్పించేందుకు భాగస్వాములుగా చేయాలని డీఆర్‌డీవో శ్రీనివాస్ అన్నారు. తాండూరు మండలంలోని ఉపాధి హామీ కార్యాలయంలో శనివారం తాండూరు క్లస్టర్‌లోని బషీరాబాద్, యాలాల, పెద్దేముల్, తాండూరు మండలాల ఏపీవో, ఈసీ, టీఏలతో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ ఉపాధి హామీ పథకం కూలీ రేటు రూ.272ల నుంచి రూ.300లకు ప్రభుత్వం పెంచిందని చెప్పారు. ముఖ్యంగా కూలిరేటు పెరిగిన విషయమై గ్రామాల్లో ప్రచారం నిర్వహించాలని చెప్పారు. పెంచిన కూలీకి సమానంగా కొలతలు ఎలా తీసుకోవాలనే విషయమై సీసీలకు వివరించారు. ప్రస్తుతం ల్యాండ్ లెవలింగ్, చెరువు, కాల్వల పూడికతీత, ఫారంపాండ్స్ పనులు చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఏపీడీ శెట్టి రవి, ఏపీవోలు నరోత్తంరెడ్డి, ఈసీలు మధుసూదన్‌రెడ్డి, కృష్ణ, నర్సింహారెడ్డి, శ్రవణ్ గౌడ్, ఆయా మండలాల్లోని ఏపీవో, సీసీ, టీఏలు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ పార్టీకి కౌన్సిలర్ల రాజీనామా

శామీర్‌పేట, ఏప్రిల్ 6: మండలంలోని తూంకుంట మున్సిపాలిటీకి చెందిన చెందిన సింగిరెడ్డి జరిని వేణుగోపాల్‌రెడ్డి, గుంతల లక్ష్మీకృష్ణా రెడ్డి, తాడెం ఆంజనేయులు, పాండులు, కొడిమెల ఉమాఆంజనేయులు శనివారం బీఆర్ఎస్ పార్టీకి రాజీనామా చేసినట్లు ప్రకటించారు. ఈవిషయాన్ని తూంకుటలో విలేకరుల సమావేశంలో వెల్లడించారు. స్వతంత్ర అభ్యర్థులుగా గెలుపొందిన తమను పార్టీలో చేరిన పక్షంలో ఆయా వార్డుల్లో అభివృద్ధి పనులు చేపడతానని మాజీ మంత్రి మల్లారెడ్డి హామీ మేరకు బీఆర్ఎస్ పార్టీ లో చేరామన్నారు. పార్టీలో చేరినా అభివృద్ధి పనులపై ఎలాంటి చర్యలు తీసుకోలేదని అసహనం వ్యక్తం చేసారు. ఈ మేరకు తాము ఎమ్మెల్యే మల్లారెడ్డి తీరుకు నిరసనగా బీఆర్ఎస్‌కు రాజీనామా చేస్తున్నట్లు వివరించారు.



మాట్లాడుతున్న డీకే.అరుణ

దేశరక్షణకు బీజేపీని గెలిపిద్దాం

కొడంగల్, ఏప్రిల్ 6: దేశరక్షణ కోసం మరోసారి బీజేపీని గెలిపించేందుకు ప్రతీఒక్కరు కలిసి రావాలని బీజేపీ జాతీయ ఉపాధ్యక్షురాలు, పార్టీ మహబూబ్‌నగర్ పార్లమెంట్ అభ్యర్థి డీకే.అరుణ పిలుపునిచ్చారు. కొడంగల్‌లోని కేఎస్‌వీ ఫంక్షన్ హాల్‌లో శనివారం రాత్రి నిర్వహించిన బీజేపీ కార్యకర్తల సమావేశంలో ఆమె పాల్గొని మాట్లాడారు. కేంద్రంలో నరేంద్రమోడీ ప్రధాని అయ్యాక అవినీతి అక్రమాలకు తావుఇవ్వకుండా పాలన కొనసాగుతోందన్నారు. గతంలో కాంగ్రెస్ ప్రభుత్వం స్కాంలు, కుంభకోణాలతో దేశంలో అభ్రత భావానికి గురి చేసిందని ఆరోపించారు. పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీకి మద్దతు తెలుపుతూ ఓటు వేయాలని కోరారు. ఈ సమావేశంలో బస్వరాజ్, బాబాయ్యనాయుడు, కుంద్రు నర్సింహులు, బంటు రమేశ్, బండెప్ప, సర్వేశ్వర్, భానుప్రకాశ్, రాకేశ్ పాల్గొన్నారు.



బ్రహోత్సవాలకు సిద్ధమైన రామేశ్వర స్వామి ఆలయం

ఈనెల 9 నుంచి శ్రీ బుగ్గరామేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలు

షాబాద్, ఏప్రిల్ 6 : షాబాద్ మండల పరిధిలోని కొమరబండలో కొలువుదీరిన శ్రీ బుగ్గరామేశ్వర స్వామి బ్రహోత్సవాలు ఈనెల 9 నుంచి 17 వరకు నిర్వహించబోతున్నట్లు ఆలయ ఈవో శ్రీనివాసులు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. 9న ధ్వజారోహణం, 10న రుద్రాభిషేకం, 11న అగ్నిగుండం, 12న పల్లకిసే, 13న రథోత్సవం, 14న శివ నామస్మరణ, 15న పార్వతీపరమేశ్వరుల కల్యాణం, 16న దీపోత్సవం, 17న శివతీర్థము నిర్వహిస్తున్నట్లు చెప్పారు. స్వామి వారి బ్రహోత్సవాలను తిలకించడానికి జిల్లాతో పాటు వివిధ ప్రాంతాల నుంచి ప్రజలు పెద్ద ఎత్తున తరలివస్తారని చెప్పారు.

నల్లా పైప్‌లకు ట్యాప్‌లు బిగించిన పంచాయతీ సిబ్బంది

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్



నీటి పైప్‌కు ట్యాప్ బిగిస్తున్న పంచాయతీ సిబ్బంది

మొయినాబాద్ రూరల్, ఏప్రిల్ 6 : మండల పరిధిలోని నాగిరెడ్డి గూడ గ్రామంలోని నల్లా పైపులకు పంచాయతీ సిబ్బంది శనివారం ట్యాపులను బిగించారు. నాగిరెడ్డిగూడ గ్రామంలో నల్లా పైపులకు ట్యాపులు లేక 'వృథాగా రోడ్డుపై పారుతున్న తాగు నీరు' అని శనివారం ఆంధ్రజ్యోతిలో వచ్చిన కథనానికి అధికారులు స్పందించారు. పంచాయతీ కార్యదర్శి స్వప్న సిబ్బందితో కలిసి గ్రామంలోని పలు కాలనీల్లో ఏర్పాటు చేసిన నల్లా నీటి కనెక్షన్‌లకు ట్యాప్‌లను బిగించారు. గ్రామాల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించేందుకు అన్ని విధాలుగా కృషి చేయనున్నట్లు మండల పరిషత్ అభివృద్ధి అధికారి సంధ్య చెప్పారు.



లింగ బసవేశ్వరస్వామి దేవాలయంలో పూజలు నిర్వహిస్తున్న గిరిజనులు

భక్తి శ్రద్ధలతో లింగ బసవేశ్వరస్వామి జాతర

కొత్తూర్, ఏప్రిల్ 6 : కొత్తూర్ మండల పరిధిలోని కొడిచర్ల గ్రామంలో గల శ్రీ లింగ బసవేశ్వరస్వామి జాతరను గిరిజనులు భక్తి శ్రద్ధలతో జరుపుకున్నారు. మూడు రోజల పాటు జరిగే జాతరలో మొదటి రోజు (శనివారం) మహాపూజలు, బోనాలు, బసవేశ్వరస్వామి కల్యాణం, అగ్నిగుండాలు కార్యక్రమాలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. జాతరలో కాంగ్రెస్ సీనియర్ నాయకుడు ఎల్లారం శేఖర్‌రెడ్డి అన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో వైఎం తండా మాజీ సర్పంచ్ అరుణరమేష్‌నాయక్, సేవియానాయక్, రాములునాయక్, హనుమంత్‌నాయక్, జంపు, హోని, వాలి, కేస్ల, నరేష్‌నాయక్, పాల్గొన్నారు.

జనజాతర!

(ఐదో పేజీ తరువాయి)

సభా వేదికపై అగ్రనేత రాహుల్ గాంధీ, సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టివిక్రమార్క, మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, దుద్దిళ్ల శ్రీధర్ బాబు, సీతక్క, కొండా సురేఖ, పొన్నంప్రభాకర్, జూపల్లి కృష్ణారావు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలతో కలిసి విడుదల చేశారు. వంద రోజుల్లో సాధించిన వివరాలను సీఎం రేవంత్‌రెడ్డి సభలో వివరించారు. ప్రధాని మోదీ, కేసీఆర్ పదేళ్ల పాలనలో చేసిన అవినీతి అక్రమాలను ఎండగట్టారు. అధినేత రాహుల్ గాంధీ, సీఎం రేవంత్‌రెడ్డి ప్రసంగం పార్టీ శ్రేణులను ఆకట్టుకుంది. రాష్ట్రం నుంచి చిన్న పిల్లోడు పిలిచినా ఇక్కడికి వస్తానని రాహుల్ మాట ఇచ్చారు. సీఎం రేవంత్‌రెడ్డి కేసీఆర్‌కు గట్టివార్నింగ్ ఇచ్చారు. పేదలకు డబుల్ బెడ్‌రూం కట్టిస్తానని మాట తప్పిన కేసీఆర్‌కు.. చెర్లపల్లి జైలులో డబుల్‌బెడ్ రూం ఇల్లు కట్టిస్తానంటూ హెచ్చరించారు.

14 ఎంపీ స్థానాలను గెలిపించుకోవాలి : ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి

తెలంగాణలో 14 ఎంపీ స్థానాలను గెలిపించుకోవాలని ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి అన్నారు. 17స్థానాల్లో 14 స్థానాలను గెలిపిస్తే.. అభివృద్ధి సాధ్యమని అన్నారు. తుక్కుగూడ సెంటిమెంటుగా మరోసారి కాంగ్రెస్ భారీ బహిరంగ సభ ఏర్పాటు చేసిందన్నారు. పదేళ్ల పాలనకు ఇక్కడ నుంచే ఫులిస్టాప్ పడిందని, ఎంపీ ఎన్నికల్లో బీజేపీని గద్దె దించాలని అన్నారు.



సభకు తరలివస్తున్న జనం

కేసీఆర్ గడీల పాలనను బద్దలు కొట్టాం: డీసీసీ అధ్యక్షుడు చల్లా నర్సింహారెడ్డి

కేసీఆర్ గడీల పాలనను బద్దలు కొట్టామని డీసీసీ అధ్యక్షుడు చల్లా నర్సింహారెడ్డి అన్నారు. దేశంలో యువత కాంగ్రెస్ వైపు చూస్తోందన్నారు. బీజేపీ పాలన నుంచి విముక్తి కల్పించేందుకు తుక్కుగూడలో జనజాతర నిర్వహించామన్నారు. బీఆర్ఎస్ పాలన అంతమైందని, ఇక మిగిలింది బీజేపీయేనన్నారు. బీజేపీ మత వైఖరితో దేశాన్ని విచ్ఛిన్నం చేస్తుందన్నారు. రాహుల్‌ను ప్రధానిగా చూడాలని ప్రజలు ఎదురు చూస్తున్నారన్నారు.

బీజేపీ, బీఆర్ఎస్‌కు దూరంగా ఉండండి : ఏఐసీసీ కార్యదర్శి సంపత్‌కుమార్

బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలకు దూరంగా ఉండాలని ఏఐసీసీ కార్యదర్శి సంపత్‌కుమార్ అన్నారు. ఓ వైపు ప్రాంతీయ శక్తులు, మరో వైపు మత తత్వ శక్తులు సమాజాన్ని విభజించి రాజకీయం చేస్తున్నాయని ఆరోపించారు. బీఆర్ఎస్ పదేళ్ల పాలనలో అవినీతి తప్పా ఏమీలేదన్నారు. ఎంపీ ఎన్నికల్లో కాంగ్రెస్ కార్యకర్తలు, నాయకులు, సానుభూతి పరులు దీక్షబూని, ప్రమాణం చేసి ఒక్కొక్కరు వంద ఓట్లు తీసుకువచ్చి రాహుల్ గాంధీని ప్రధానిని చేయాలని ఆయన కోరారు.



బందోబస్తు నిర్వహిస్తున్న పోలీసులు

సభ సైడ్‌లైట్స్

ఇబ్రహీంపట్నం/ కందుకూర్/ మహేశ్వరం/ చౌదరిగూడ ఏప్రిల్ 6: తుక్కుగూడలో శనివారం సాయంత్రం జరిగిన జనజాతర సభకు ఎండను సైతం లెక్క చేయకుండా లక్షలాదిగా జనం తరలి వచ్చారు.

- 6:30 గంటలకు స్థానిక నాయకులతో జనజాతర సభ ప్రారంభమైంది. మొదటగా రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు షబ్బీర్‌అలీ ప్రసంగించారు.
- 6:43 గంటలకు మంత్రి కొండా సురేఖ ప్రసంగించారు
- 6:48 గంటలకు మంత్రి సీతక్క ప్రసంగించారు
- 6:54 గంటలకు మంత్రి పొన్నం ప్రభాకర్
- 7:00 గంటలకు మంత్రి జూపల్లి కృష్ణారావు
- 7:05 గంటలకు మంత్రి శ్రీధర్‌బాబు తన ప్రసంగాన్ని కొనసాగిస్తుండగా...
- 7:07గంటలకు ఏఐసీసీ అగ్రనేత రాహుల్‌గాంధీ, సీఎం రేవంత్‌రెడ్డి, ఉప ముఖ్యమంత్రి బట్టివిక్రమార్క, ఏఐసీసీప్రధాన కార్యదర్శి కేసీవేణుగోపాల్, రాష్ట్ర కాంగ్రెస్ వ్యవవరాలఇన్‌చార్జి దీపాదాస్ మున్షీ సభ వేదికపైకి వచ్చారు.
- 7:17 గంటలకు అఖిలభారత కాంగ్రెస్ పార్టీ మ్యానిఫెస్టో విడుదల చేశారు.
- 7:20 గంటలకు రాహుల్‌గాంధీ ప్రసంగాన్ని మొదలుపెట్టి 7:58 ముగించారు.
- 8:00 గంటలకు మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి ప్రసంగం ప్రారంభించి నిమిషంలోనే ముగించారు.
- 8:01 గంటలకు ఉప ముఖ్యమంత్రి మలు భట్టి విక్రమార్క ప్రసంగించారు.
- 8.08 గంటలకు మొదలైన సీఎం రేవంత్ రెడ్డి తన ప్రసంగాన్ని ప్రారంభించగా
- 8:27గంటలకు ప్రసంగం ముగించారు. దీంతో జన జాతర సభ ముగిసింది.

సభలో పోలీసుల భారీ బందోబస్తు

తుక్కుగూడలో జరిగిన కాంగ్రెస్ జన జాతర సభలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరకుండా వేయి మంది పోలీస్ బలగాలతో భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు ఇది గాక సభా వేదిక నలుమూల కేంద్ర బలగాలచే భారీ భద్రత కొనసాగింది.

బీజేపీకి మత పిచ్చి పెరిగి పోతుంది : జడ్పీ చైర్‌పర్సన్ తీగల అనితాహరినాథ్‌రెడ్డి

బీజేపీకి మత పిచ్చి పెరిగిపోతుందని జడ్పీ చైర్‌పర్సన్ తీగల అనితాహరినాథ్‌రెడ్డి ఆరోపించారు. ఎంపీ ఎన్నికల్లో బీజేపీకి బుద్ధి చెప్పేందుకు కాంగ్రెస్ సిద్ధంగా ఉందన్నారు. బీజేపీ మతం పేరుతో ముందు కెళ్తుందని, నిరుద్యోగం గురించి పట్టించుకోవడం లేదన్నారు. రాహుల్ గాంధీని ప్రధానిగా గెలిపించుకోవాలని కోరారు. ప్రజలు ఆలోచించి ఎంపీ ఎన్నికల్లో ఓటు వేయాలన్నారు.

దైవకార్యాల్లో భాగస్వాములు కావాలి

- విద్యారణ్య భారతీస్వామి

చేవెళ్ల, ఏప్రిల్ 6: ప్రజలందరూ దైవకార్యాల్లో భాగస్వాములు కావాలని హంపీ విరుపాక్ష విద్యారణ్య పీఠాధీశ్వరులు శ్రీశ్రీశ్రీ విద్యారణ్య భారతీస్వామి అన్నారు. చేవెళ్ల మండల పరిధిలోని మల్కాపూర్ గ్రామంలో శ్రీశ్రీశ్రీ భువనేశ్వరీ సహిత పంచలింగేశ్వర, నవగ్రహ, పంచముఖి ఆంజనేయ స్వామి వార్ల దేవాలయ ద్వితీయ పుష్కర కుంభాభిషేకం మహోత్సవాలు మూడు రోజులు ఘనంగా జరిగాయి. శనివారం ముగింపు సందర్భంగా విద్యారణ్య భారతీస్వామి హాజరుకాగా ఆలయం కమిటీ నిర్వాహకులు పూర్ణకుంభంతో ఘనస్వాగం పలికారు. హోమం పూర్తి అయ్యాక కలశంలోని నీటిని ఆలయం గోపురాలపై చల్లారు. అలాగే హోంమంలో కూర్చున్న దంపతులను ఆశీర్వదించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ దైవనామస్మరణ చేయాలన్నారు. దేవాలయం శివనామస్మరణతో మారుమోగింది. అక్కడకు వచ్చిన భక్తులందరి మూడు రోజులుగా అన్నదానాలు చేశారు. కార్యక్రమంలో దేవాలయ కమిటీ సభ్యులు, భక్తులు, ప్రజలు తదితరులు ఉన్నారు.



మల్కాపూర్‌లో పూర్ణకుంభంతో స్వాగతం పలుకుతున్న భక్తులు

పథకాల అమలులో కాంగ్రెస్ సర్కార్ విఫలం

- బీజేపీ చేవెళ్ల ఎంపీ అభ్యర్థి కొండా విశ్వేశ్వర్‌రెడ్డి

మోమిన్‌పేట్, ఏప్రిల్ 6: సంక్షేమ పథకాల అమలులో కాంగ్రెస్ సర్కార్ విఫలమైందని బీజేపీ చేవెళ్ల ఎంపీ అభ్యర్థి కొండా విశ్వేశ్వర్ రెడ్డి విమర్శించారు. ప్రజా ఆశీర్వాదయాత్రలో భాగంగా శనివారం మోమిన్‌పేట్ మండలంలో ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తాను ఎంపీగా ఉన్న సమయంలో చేపట్టిన పనులే ఇప్పుడు స్వాగతం పలుకుతున్నాయన్నారు. 2014 నుంచి 2019 వరకు తాను ఎంపీగా ఈప్రాంతంలో చేసిన అభివృద్ధి పనులు ఇప్పటికీ ప్రజలకు గుర్తుండిపోయాయని తెలిపారు. ఎంపీ నిధులతో వికారాబాద్ నియోజకవర్గంలోని 400 గ్రామాల్లో అభివృద్ధి పనులు చేపట్టినట్లు తెలిపారు. రాష్ట్రంలో అధికారంలోకి వచ్చేందుకు మోసపూరిత వాగ్దానాలు చేసిన కాంగ్రెస్ వాటి అమలులో విఫలమైందన్నారు. కేంద్రంలో మరోసారి మోదీ ప్రధాని కావడం ఖాయమన్నారు. డిసెంబరు 9వ తేదీన రూ.2లక్షల రైతు రుణమాఫీ చేస్తామన్న హామీ ఏమైందని ప్రశ్నించారు. ఆరు గ్యారంటీ పథకాలతో ప్రజలను మోసం చేశారని మండిపడ్డారు. చంద్రాయన్‌పల్లి, కోల్‌కొండ, అమ్రాదికుర్దు, మేకవనంపల్లి, రాళ్లగూడుపల్లి, టేకులపల్లి, మల్లారెడ్డిగూడెం గ్రామాల్లో నిర్వహించిన ప్రజా ఆశీర్వాదయాత్రలో ఆయన పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు మాధవరెడ్డి, పాండుగౌడ్, కేపీ రాజు, బుస శ్రీకాంత్, రమేశ్, లక్ష్మారెడ్డి, రఘునాథ్ రెడ్డి, రాజురెడ్డి తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న చేవేళ్ల ఎంపీ అభ్యర్థి కొండ విశ్వేశ్వర్‌రెడ్డి

దేశంలో మోదీ వేవ్ నడుస్తోంది

వికారాబాద్: దేశంలో నరేంద్ర మోడీవేవ్ నడుస్తోందని కొండా విశ్వేశ్వర్‌రెడ్డి అన్నారు. ఆయన శనివారం సాయంత్రం ప్రజా ఆశీర్వాద యాత్ర మండలంలోని పులుమద్ది, నారాయణపూర్, అత్తెల్లి, మదన్‌పల్లి, మైలార్ దేవరంపల్లి గ్రామాల్లో కొనసాగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలో బీఆర్ఎస్ ఖాళీ అవుతోందన్నారు. పార్టీ నాయకులు ఇతర పార్టీలోకి వెళ్తున్నారని తెలిపారు. యువకులంతా బీజేపీ వైపు చూస్తున్నారని ఆయన తెలిపారు. ప్రజా ఆశీర్వాద యాత్రలో మాజీ ఎమ్మెల్యే కేఎస్ రత్నం, బీజేపీ నాయకులు, కార్యకర్తలు, పెద్దసంఖ్యలో ప్రజలు యువకులు పాల్గొన్నారు.

కదిలే కళాఖండాలు

- మదిని మైమరపించేలా విన్సెంట్ వ్యాన్గో చిత్రాలు
- 230కుపైగా చిత్రాలతో అరుదైన ప్రదర్శన

హైదరాబాద్ సిటీ, ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి): జగమెరిగిన ప్రఖ్యాత చిత్రకారుడు విన్సెంట్ వ్యాన్గో. ఆయన కుంచె నుంచి జాలువారిన ప్రతి చిత్రం ఒక అద్భుతమే. వ్యాన్గో కన్నుమూసి 130ఏళ్లు దాటినా... తాను గీసిన చిత్రాలకు నేటికి జనం జయహోలు పలుకుతున్నారంటే అతిశయోక్తి లేదు. ఆయన జీవితం ఆధారంగా తీసిన సినిమాలు, రాసిన పుస్తకాలకు కూడా అమితాదరణ లభించడం చూశాం. దటీజ్ వ్యాన్గో.! ప్రపంచవ్యాప్తంగా కోట్లాదిమంది అభిమానుల ఆరాధ్య చిత్రకారుడిగా జననీరాజనాలు అందుకుంటున్న ఈ డచ్ ఆర్టిస్టు వర్ణ చిత్రాలు ఇప్పుడు నగరం ముంగిట కొలువుదీరాయి. వినీలాకాశాన్ని చుట్టుముట్టిన నక్షత్రాలతో... చూడటానికి రెండు కళ్లు చాలవన్నట్టుండే 'స్టారీ నైట్ పెయింటింగ్.. మధ్యతరగతి భావోద్వేగాలకు అద్దంపట్టే 'పొటాటో ఈటర్స్', తన్మయత్వానికి లోనుచేసే 'వీట్‌ఫీల్డ్', సన్‌ఫ్లవర్, ఆల్మండ్ బ్లాసమ్స్.. ఇలా అరుదైన అద్భుత కళాఖండాలను చూడాలంటే హైటెక్స్‌లోని 'విన్సెంట్ వ్యాన్గో ఇమ్మర్సివ్ ఎక్స్‌పీరియెన్స్' షోకు వెళ్లాల్సిందే.



కదిలే బొమ్మలు..

కేవలం వ్యాన్గో వర్ణచిత్రాలను సాదాసీదాగా చూడటం కాదు... ప్రదర్శన లోపలికి అడుగుపెట్టగానే వ్యాన్గో జీవిత విశేషాలతో కూడిన చిత్రపటాలు మనసును కదిలిస్తాయి. కన్నీళ్లు తెప్పిస్తాయి. అది దాటి ఇన్నినిటీగదిలోకి వెళ్లగానే... ఇదివరకెన్నడూ చూడని ఒక కొత్త లోకాన్ని చూస్తున్నామన్న భావన మనసొంతమవుతుంది. విద్యుత్ దీపాల ధగధగల మధ్య గది ఉపరితలంతో పాటు కిందిభాగమంతా పరుచుకొన్న 'స్టారీనైట్ వర్ణచిత్రాన్ని చూస్తుంటే... వ్యాన్గో గీసిన ఆ అపురూప చిత్రంలోని సన్నివేశాన్ని మనం ప్రత్యక్షంగా చూస్తున్నామన్నంతగా అనుభూతికి లోనవుతామనడంలో అతిశయోక్తి లేదు. ఆ తర్వాత పలకరించే ఇమ్మర్సివ్ ప్రాంగణంలో ఎదురయ్యే అనుభవం మాటలకు అందనిది! వ్యాన్గో గీసిన వాటిల్లో 236 అపురూప చిత్రాలు త్రీడీరూపంలో రూపుదిద్దుకొన్న దృశ్యకావ్యం 360డిగ్రీల కోణంలో తల ఎటుతిప్పినా.. కళ్ల ముందు కదలాడుతూ చూపరులను మైమరిచిపోయేలా చేస్తుంది. వ్యాన్గో ప్రతి చిత్రం.. అందులోని ప్రతి వ్యక్తి, వస్తువు, చెట్టు, చేమ, పక్షి, పైరు, అలలు, చెలమలు.. ప్రతిదీ కదులుతున్నట్టు చూపించడం ఒక అద్భుతం. విన్సెంట్ వ్యాన్గో స్వీయ చిత్రాలు, సన్‌ఫ్లవర్ బొమ్మలు, కేఫ్ టెర్రాస్... ఇలా ల్యాండ్‌స్కేప్, పోర్ట్రయిట్, స్టిల్‌లైఫ్ కంపొజిషన్స్ తదితర కళాఖండాలు సజీవ చిత్రాలుగా మారి గది నలుదిక్కులా గోడమీద కదిలాడుతున్న భావన సందర్శకులకు కలుగుతుంది. ఈ 3డీదృశ్యమాలిక ప్రదర్శనకు 20కే లుమెన్స్ ప్రొజెక్టర్‌ను వాడుతున్నట్టు ఎగ్జిబిషన్ నిర్వాహకులు చెబుతున్నారు. వ్యాన్గో చిత్రాలతో ముద్రించిన టీషర్ట్‌లు, కాఫీ కప్‌లు, కీచైన్‌లాంటి తదితర వస్తువులను సందర్శకులకు అందుబాటులో ఉంచారు.

నృసింహుడి ఆలయానికి పూర్వవైభవం!

- దాతల సహకారంతో అభివృద్ధి పనులు
- కొందుర్గు మండలం పెండ్యాల గుట్టపై బోరు మోటారు, ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు
- ఉగాదిని పురస్కరించుకొని ఆలయ పరిసరాలు చదును
- ఉత్సవాలకు ముస్తాబవుతున్న దేవాలయం

కొందుర్గు, ఏప్రిల్ 6: మండల కేంద్రానికి రెండు కిలోమీటర్ల దూరంలో పెండ్యాల గుట్టపై వెలసిన శ్రీలక్ష్మీనృసింహస్వామి ఆలయం పూర్వవైభవం సంతరించుకుంటోంది. దాతలు ముందుకు వస్తుండడంతో ఆలయం వద్ద పలు అభివృద్ధి పనులు కొనసాగుతున్నాయి. ఉగాదికి సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించేందుకు నిర్వాహకులు ఏర్పాట్లు చేస్తున్నారు. వివరాల్లోకి వెళితే.. కొనదుర్గాన్ని(ప్రస్తుతం కొందుర్గు) 7వ శతాబ్దంలో బాదామి చాళుక్యులు పరిపాలించారు. కొనదుర్గానికి రెండు కిలో మీటర్ల దూరంలో పెండ్యాల అనే గ్రామం ఉండేది. ఈ గ్రామంలో గుట్టపై ఉన్న ఓ రాతిబండపై చీమలు మలిచిన విగ్రహం ఉండేది. అప్పట్లో దాన్ని శ్రీ నృసింహస్వామిగా కొలిచేవారు. ఈక్రమంలో విగ్రహాన్ని గమనించిన ఓ పండితుడు చాళుక్య రాజులకు ఈ వింతను వివరించారు. దాంతో బాదామి చాళుక్యరాజులు నృసింహస్వామికి ఆ ప్రదేశంలో ఆలయం నిర్మించారు. దేవాలయానికి ఆదాయాన్ని సమకూర్చేందుకు, నిత్యపూజలు చేసేందుకు అప్పట్లోనే 365 ఎకరాలు భూమిని దానంగా ఇవ్వగా.. ప్రస్తుతం 312 ఎకరాలు ఆలయం పేరిట ఉంది. కాగా, బాదామి చాళుక్యుల కాలంలో ఓ వెలుగు వెలిగిన ఆలయం.. ఔరంగజేబు పాలనలో ధ్వంసమైంది. దాంతో పెండ్యాల గ్రామస్తులు గ్రామాన్ని విడిచి కొనదుర్గానికి వచ్చారు. ఇక్కడే ఉత్సవ విగ్రహాలతో ఆలయాన్ని ఏర్పాటు చేసుకున్నారు. నేడు పెండ్యాల గుట్ట మీద వెలసిన స్వామివారికి నిత్యపూజలు కరువయ్యాయి. కోట్ల రూపాయల విలువైన భూములున్నా.. దేవుడికి దీపం పెట్టే దిక్కు లేకుండాపోయింది. ధూప దీప, నైవేద్యాలకు నోచుకోవడం లేదు. ఆలయానికి వెళ్లేందుకు రోడ్డు మార్గం, భక్తులకు ఎలాంటి వసతులు లేకపోవడం, ఆలయం అటవీ ప్రాంతంలో ఉండడంతో భక్తులకు ఇబ్బందిగా మారింది. ప్రతీ సంవత్సరం ఉగాది, దసరాకు మండల కేంద్రంలో ఉన్న దేవాలయం నుంచి పెండ్యాల గుట్టమీద ఉన్న పాత ఆలయం వరకు ఉత్సవ విగ్రహాలను తీసుకువెళ్లి పూజా కార్యక్రమాలు నిర్వహించేవారు. సంవత్సరంలో రెండు రోజులు తప్పా.. మిగతా రోజులు ఆ దేవాలయానికి ఎవరూ వెళ్లేవారు కాదు. దాంతో దేవాలయం శిథిలావస్థకు చేరుకుంది.



పెండ్యాల గుట్టపై వెలసిన లక్ష్మీనృసింహస్వామి ఆలయం



చదును చేసిన ఆలయ పరిసరాలు

దాతల సహకారంతో చకచకా పనులు

కాంగ్రెస్ పార్టీ నుంచి ఎమ్మెల్యేగా గెలుపొందిన వీర్లపల్లి శంకర్‌కు ఆలయం గురించి కొందుర్గు గ్రామస్తులు వివరించారు. దాంతో వారం క్రితం ఎమ్మెల్యే సహకారంతో 15కేవీ ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు చేసి విద్యుత్ సౌకర్యం కల్పించారు. భక్తులకు తాగునీటి వసతి కల్పించేందుకు తొమ్మిదేళ్ల క్రితం కొంతమంది దాతలు బోరు వేయించారు. కొందుర్గు గ్రామానికి చెందిన ఇద్దరు రూ.20వేలు, మండల పరిధిలోని శ్రీరంగాపూర్ గ్రామానికి చెందిన మరో దాత రూ.20వేల విరాళం అందజేయడంతో బోరుకు మోటరును అమర్చి విద్యుత్ సౌకర్యం కల్పించారు. ఉగాదికి స్వామివారి ఉత్సవ విగ్రహాలను పాత దేవాలయంలోకి తీసుకువస్తామని ఈవో శ్రీనివాస శర్మ తెలిపారు. ఈమేరకు ఆలయ పరిసరాలను చదును చేశారు. కంప చెట్లను, రాళ్లను తొలగించినట్లు చెప్పారు. అయితే, పరిసరాలను చదును చేస్తున్న క్రమంలో దేవతా మూర్తుల విగ్రహాలు బయట పడుతున్నాయని ఆయన తెలిపారు. ఏది ఏమైనా ఆలయానికి పూర్వవైభవం సంతరించుకుంటోందని మండలవాసులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

అభివృద్ధి పనులు చేపడుతున్నాం



ఉగాదిని పురస్కరించుకొని పెండ్యాల గుట్ట మీద ఉన్న నృసింహస్వామి పాత ఆలయంలో దాతల సహకారంతో, దేవస్థానం నిధులతో ప్రస్తుతం కొన్ని అభివృద్ధి పనులు చేయిస్తున్నాం. ఉగాది తరువాత దేవదాయ, ధర్మాదాయ శాఖ ఉన్నతాధికారుల అనుమతి తీసుకొని, స్థపతి, ఇంజనీర్లను తీసుకొచ్చి అభివృద్ధి పనులకు సంబంధించి బడ్జెట్ అంచనా వేయిస్తాం.

- శ్రీనివాస శర్మ, (ఈవో) ఇన్‌చార్జి కార్యనిర్వాహణాధికారి


యాలాల: జనజాతర బహిరంగ సభకు బయల్దేరిన కాంగ్రెస్ శ్రేణులు


కొడంగల్: సభకు బయల్దేరుతూ కాంగ్రెస్ కార్యకర్తల నినాదాలు


దౌల్తాబాద్: తుక్కుగూడ సభకు బయల్దేరిన కాంగ్రెస్ కార్యకర్తలు

తుక్కుగూడ సభకు తరలిన కాంగ్రెస్ శ్రేణులు

రంగారెడ్డిజిల్లా తుక్కుగూడలో శనివారం కాంగ్రెస్ ఆధ్వర్యంలో నిర్వహించిన నిర్వహించిన జనజాతర బహిరంగ సభకు వికారాబాద్, మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాల నుంచి పార్టీ శ్రేణులు పెద్దఎత్తున తరలివెళ్లారు. ఈ సందర్భంగా ర్యాలీలు నిర్వహించి జెండా ఊపి ప్రత్యేక బస్సుల్లో పార్టీ నాయకులు, కార్యకర్తలు తుక్కుగూడకు బయల్దేరారు.


తాండూరు: జన జాతర యాత్రకు జెండా ఊపి బస్సు ర్యాలీని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి


ఘట్‌కేసర్: అవుటర్ రింగ్ రోడ్డుపై జెండాఊపి ర్యాలీని ప్రారంభిస్తున్న మేడ్చల్ నియోజకవర్గ ఇంచార్జి వజ్రేష్ యాదవ్


కులకచర్ల: ముజాహిద్‌పూర్ నుంచి తుక్కుగూడ సభకు వెళ్తున్న కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు


కొడంగల్: నాగారం నుంచి తుక్కుగూడ సభకు వెళ్తున్న కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు


పూడూరు: కండ్లపల్లి నుంచి తరలివెళ్తున్న కాంగ్రెస్ జిల్లా కార్యదర్శి, నాయకులు


ధారూరు: కాంగ్రెస్ జనజాతరకు తరలుతున్న కాంగ్రెస్ శ్రేణులు


కీసర రూరల్: తుక్కుగూడకు తరలివెళ్తున్న కీసర కాంగ్రెస్ పార్టీ శ్రేణులు

అయోధ్య బాలరాముడిని దర్శించుకున్న ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ



మేడ్చల్, ఏప్రిల్ 6(ఆంధ్రజ్యోతి ప్రతినిధి): మాజీ మంత్రి మల్లారెడ్డి, మేడ్చల్ ఎమ్మెల్యే శనివారం అయోధ్య బాలరాముడిని దర్శించుకున్నారు. ఆయనతో పాటు ఎమ్మెల్సీ శంభీపూర్‌రాజు ఉన్నారు. ఈ సందర్భంగా మల్లారెడ్డి మాట్లాడుతూ బాలరాముడిని దర్శించుకోవడం ఆనందంగా ఉందన్నారు. కాగా ఎన్నికల్లో బీఆర్ఎస్ ఓడిన తర్వాత మల్లారెడ్డి విహార యాత్రలు, ఆధ్యాత్మిక యాత్రలతో కాలక్షేపం చేస్తున్నారు.

దోమల నివారణకు ప్రత్యేక చర్యలు

ఘట్‌కేసర్, ఏప్రిల్ 6 : దోమల నివారణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు పోచారం మున్సిపల్ చైర్మన్ బోయపల్లి కొండల్‌రెడ్డి అన్నారు. శనివారం మున్సిపాలిటీ పరిధిలోని అన్నోజిగూడలో గల బందంకుంటలో దోమల నివారణ కోసం చేపట్టిన చర్యలను ఆయన పరిశీలించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ సిబ్బంది స్థానికులు పాల్గొన్నారు.

అభివృద్ధిలో భాగస్వామ్యం కావాలి

కులకచర్ల, ఏప్రిల్ 6: పాఠశాలల అభివృద్ధిలో అమ్మ ఆదర్శ పాఠశాలల కమిటీ చైర్మన్‌లు భాగస్వామ్యం కావాలని కులకచర్ల ఎంపీడీవో రామకృష్ణ సూచించారు. ఎంపీడీవో కార్యాలయంలో కులకచర్ల, చౌడాపూర్ మండలాల పరిధిలో శనివారం నూతనంగా ఎంపికైన అమ్మ ఆదర్శ పాఠశాలల చైర్మన్‌లు, హెచ్ఎంలతో సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కులకచర్ల, చౌడాపూర్ మండలాల ప్రత్యేకాధికారులు సరళ, ఉపేందర్, ఎంఈవో హబీబ్ అహ్మద్, ఏపీఎం శోభ, ఆయా పాఠశాలల క్లస్టర్ హెచ్ఎంలు పాల్గొన్నారు.

వడదెబ్బ తగలకుండా జాగ్రత్తలు తీసుకోవాలి

ధారూరు, ఏప్రిల్ 6: ఎండలు మండుతున్నందున వడదెబ్బ తగలకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని ధారూరు పీహెచ్‌సీ వైద్యాధికారి సుష్మ తెలిపారు. గట్టేపల్లి గ్రామంలో శనివారం ఉపాధి పనులకు ఓఆర్ఎస్ ప్యాకెట్‌లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో హెచ్ఏ సురేందర్, ఏఎన్ఎం శోభ పాల్గొన్నారు.

పరిగి: వేసవి ఎండల దృష్ట్యా ఉపాధికూలీలు జాగ్రత్తలు పాటించాలని చిట్యాల్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం డాక్టర్ ఎస్.ప్రవీణ్‌కుమార్ అన్నారు. సయ్యద్ మల్కాపూర్ గ్రామంలో శనివారం పర్యటించి ఉపాధి కూలీలకు తగు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో ఎంఐహెచ్‌పీ డాక్టర్ రాఘవేందర్‌రెడ్డి, సూపర్‌వైజర్లు, ఉపాధి కూలీలు పాల్గొన్నారు.

ప్రత్యేక అలంకరణలో వేంకటేశ్వరస్వామి



కొడంగల్, ఏప్రిల్ 6: పేదల తిరుపతిగా, కోరిన కోర్కెలు తీర్చే కొడంగల్ మహాలక్ష్మి వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు అంగరంగ వైభవంగా కొనసాగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా శనివారం స్వామివారు సింహ వాహనంపై భక్తులకు దర్శనం ఇచ్చారు. ఆలయ అర్చకులు స్వామివారికి అభిషేకం తదితర పూజా కార్యక్రమాలు నిర్వహించారు.

రైతు వ్యతిరేక విధానాలు అవలంభిస్తున్న కాంగ్రెస్


వికారాబాద్: రైతు దీక్షలో మాట్లాడుతున్న బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు మెతుకు ఆనంద్


కొడంగల్: రైతులకు మద్దతుగా నిరసనలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి

వికారాబాద్, ఏప్రిల్ 6: కాంగ్రెస్ ప్రభుత్వం రైతు వ్యతిరేక విధానాలను అవలంభిస్తోందని వికారాబాద్ మాజీఎమ్మెల్యే, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు మెతుకు ఆనంద్ అన్నారు. శనివారం పార్టీ ఆదేశాల మేరకు వికారాబాద్ ఆర్డీవో కార్యాలయ ఆవరణలో రైతుదీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కరువు కాలం తెచ్చింది కాదని కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకొచ్చిందన్నారు. ఈ కార్యక్రమంలో జడ్పీ వైస్‌చైర్మన్ విజయ్ కుమార్, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ విజయ్‌కుమార్, పట్టణ అధ్యక్షుడు ప్రభాకర్‌రెడ్డి, మాజీ రైతు సంఘం అధ్యక్షుడు రాంరెడ్డి, కౌన్సిలర్లు గోపాల్, అనంత్‌రెడ్డి, రామస్వామి, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

యాలాల: అబద్దపు హామీలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ఎక్కువ రోజులు ఉండబోదని వికారాబాద్ జిల్లా గ్రంథాలయ మాజీ చైర్మన్ రాజుగౌడ్ అన్నారు. మండల పరిధిలోని లక్ష్మీనారాయణపూర్ చౌరస్తాలో శనివారం తాండూరు నియోజకవర్గ బీఆర్ఎస్ నాయకులు రైతుదీక్ష కార్యక్రమాన్ని చేపట్టారు. ఈకార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు శ్రీనివాస్‌చారి, నర్సింహులు, రాంలింగారెడ్డి, వడ్డె రాములు, రాజు పటేల్, శంకర్, అనంతయ్య పాల్గొన్నారు.

పరిగి: కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికలముందు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో పూర్తిగా విఫలమైందని పరిగి మాజీ ఎమ్మెల్యే కె.మహేశ్‌రెడ్డి విమర్శించారు. బీఆర్ఎస్ ఆధ్వర్యంలో పరిగి బస్టాండ్ ఎదుట శనివారం ధర్నా నిర్వహించారు. చేవెళ్ల ఎంపీ అభ్యర్థి కాసాని జ్ఞానేశ్వర్‌ను భారీ మెజార్టీతో గెలిపిద్దామని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పరిగి మున్సిపల్ చైర్మన్ ఎం.అశోక్, పరిగి, పూడూరు ఎంపీపీలు అరవింద్‌రావు, మల్లేశం, దోమ జడ్పీటీసీ కె.నాగిరెడ్డి, పీఏసీఎస్ చైర్మన్లు శ్యాంసుందర్‌రెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, మాజీ ఏఎంసీ చైర్మన్ సురేందర్, ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

కొడంగల్: రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని కొడంగల్ మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి డిమాండ్ చేశారు. మాజీ సీఎం కేసీఆర్ ఆదేశాల మేరకు శనివారం కొడంగల్ అంబేడ్కర్ చౌరస్తాలో నియోజకవర్గ బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలతో కలిసి నిరసన తెలిపారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ కార్యకర్తలు పాల్గొన్నారు.

ఘనంగా బీజేపీ ఆవిర్భావ దినోత్సవం

బీజేపీ ఆవిర్భావ దినోత్సవాన్ని శనివారం పార్టీ శ్రేణులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వికారాబాద్, మేడ్చల్ జిల్లాల పరిధిలో పార్టీ జెండాలను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో పార్టీ శ్రేణులు పాల్గొన్నారు.


పరిగి: పార్టీ జెండాను ఆవిష్కరిస్తున్న నియోజకవర్గ ఇన్‌చార్జి మారుతికిరణ్


తాండూరు: బీజేపీ ఆవిర్భావ వేడుకలు పార్టీ నాయకులు, కార్యకర్తలు


మేడ్చల్ టౌన్: పార్టీ జెండాను ఆవిష్కరిస్తున్న బీజేపీ నాయకులు

పాఠశాల అభివృద్ధిలో అమ్మ ఆదర్శ కమిటీలు కీలకం

తాండూరు రూరల్, ఏప్రిల్ 6: ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధిలో అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీలు కీలకమని ఎంపీడీవో విశ్వప్రసాద్ అన్నారు. ఎంపీడీవో కార్యాలయ ఆవరణలో పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, గ్రామ మహిళాసంఘం అధ్యక్షులతో శనివారం సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఉద్యానవన శాఖ అధికారి మల్లికార్జున్, హెచ్ఎంలు వైద్యనాథ్, మృత్యుంజయస్వామి, రాంనర్సింహారెడ్డి, కిష్టప్ప, నాగప్ప, నర్సిరెడ్డి, చారి, మండల స్పెషల్ ఆఫీసర్ ఎం.ఎ.ఎత్తార్, ఏపీఎం ఆనంద్, ఏటీఎం ఆనంద్, మహిళా అధ్యక్షులు పాల్గొన్నారు.

బషీరాబాద్: స్థానిక ఎంపీడీవో కార్యాయం సమావేశ హాల్‌లో బషీరాబాద్ మండల ప్రత్యేకాధికారి వీరభద్రయ్యశనివారం అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీల కన్వీనర్లు, హెచ్ఎంలు, పంచాయతీ కార్యదర్శులు, మండల స్థాయి అధికారులతో సమీక్ష నిర్వహించారు.

దోమ: మండల కేంద్రంలోని రైతువేదికలో శనివారం ప్రధానోపాధ్యాయులు, నూతనంగా ఎన్నికైన అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ చైర్మన్‌లకు అవగాహన సదస్సులు నిర్వహించారు. ఎంపీడీవో మహేశ్‌బాబు, ప్రత్యేకాధికారి హనుమంతురావు, ఎంఈవో హరిశ్చంద్ర నూతనంగా ఏర్పడిన అమ్మ ఆదర్శ పాఠశాలల కమిటీలకు పలు సూచనలు చేశారు.

దద్దరిల్లిన శామీర్‌పేట మండల సభ

శామిర్‌పేట, ఏప్రిల్ 6: శామీర్‌పేట మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో ఎంపీపీ ఎల్లుబాయి అధ్యక్షతన శనివారం మండల సర్వ సభ్య సమావేశం జరిగింది. ఈసారి సర్పంచులు లేకపోయినప్పటికీ ఎంపీటీసీలతోనే సమస్యలపై సభ దద్దరిల్లింది. అలియబాద్, బొమ్మరాశిపేట, శామిర్‌పేట గ్రామాల పరిధిలో పంచాయతీల అనుమతులు లేకుండా ఇష్టారాజ్యంగా అక్రమ నిర్మాణాలను జరుపుతుంటే సంబంధిత పంచాయతీ అధికారులు, ఎంపీవో ఏమి చేస్తున్నారని ఆయా గ్రామాల ఎంపీటీసీలు అధికారులపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో జడ్పీటీసీ అనిత, సంబంధిత శాఖల అధికారులు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

సాంస్కృతిక కార్యక్రమాల్లో ఆకట్టుకున్న విద్యార్థుల ప్రతిభ

కొడంగల్, ఏప్రిల్ 6: కొడంగల్ శ్రీ మహాలక్ష్మీ వేంకటేశ్వరస్వామి 44వ వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా శనివారం సాయంత్రం నిర్వహించిన బాలాజీ ఆడుతా పాడుతా తీయగా కార్యక్రమంలో కొడంగల్ పట్టణంలోని నవీన ఆదర్శ పాఠశాల విద్యార్థులు ప్రతిభ కనబర్చారు. ఆలయ ఆవరణలో నిర్వహించిన వివిధ సాంస్కృతిక కార్యక్రమాల్లో పాల్గొన్న విద్యార్థులు భక్తులను ఆకట్టుకున్నారు. ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు ఆలయ ధర్మకర్తలు బహుమతులు అందించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపల్ డీవీ.నరేశ్‌రాజ్, వైస్ ప్రిన్సిపల్ సంతోష, పాఠశాల చైర్మన్ డాక్టర్ అనిల్‌రాజ్, శృతి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

విద్యార్థుల విహారయాత్ర

మోమిన్‌పేట్, ఏప్రిల్ 6: మేకవనంపల్లి పాఠశాల విద్యార్థులు దాదాపు 250 మంది శనివారం పాఠశాల నుంచి హైదరాబాద్‌లోని పలు చారిత్రాత్మక కట్టడాలు, ప్రదేశాలను తిలకించేందుకు తీసుకెళ్లినట్లు ప్రధానోపాధ్యాయుడు గౌరీ శంకర్ తెలిపారు.

విద్యార్థులు ప్లేస్‌మెంట్ సాధించాలి

మేడ్చల్ టౌన్, ఏప్రిల్ 6: విద్యార్థులు మంచి ప్లేస్‌మెంట్ సాధించన నాడే వారు జీవితంలో మంచిగా స్థిరపడతారని ట్రైనింగ్ అండ్ ప్లేస్ మెంట్ అధికారి డాక్టర్ ఎస్.శ్రీకాంత్ అన్నారు. గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ పరిధిలోని మైసమ్మగూడ సేయింట్ పీటర్స్ ఇంజినీరింగ్ కళాశాలలో శనివారం ప్లేస్‌మెంట్ సక్సెస్ మీట్-2024 నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పలు వ్యాపార సంస్థలకు సంబంధించిన ప్రతినిధులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా తమ కళాశాల నుంచి 700 మంది విద్యార్థులు ప్లేస్‌మెంట్లు పొందారన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల చైర్మన్ టి.బాలారెడ్డి, ప్రిన్సిపల్ డాక్టర్ శ్రీలత, డైరెక్టర్లు, టీవీ.రెడ్డి, అనురాగ్ రెడ్డి, సరోజారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్తంగా..

● **మేడ్చల్, (ఆంధ్రజ్యోతి ప్రతినిధి):** మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలో ఇంటర్మీడియట్ విద్యార్థినీ విద్యార్థులకు మార్చి 19వ తేదీన పరీక్షలు పూర్తవగానే వేసవిసెలవులు ఇవ్వాలని ఎస్ఎఫ్ఐ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో ఇంటర్ కాలేజీలకు వేసవి సెలవులు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ శనివారం డీఐఈవో కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేశారు. విద్యార్థులను ఇబ్బందులకు గురిచేస్తున్న కళాశాలలపై కఠిన చర్యలు తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ జిల్లా ప్రధాన కార్యదర్శి సంతోష్ డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో అరుణ్, అవినాష్, చరణ్, శ్యామ్‌రావు, మనీకంఠ, అనుదీప్, సాయి, తదితరులు పాల్గొన్నారు.

● **మేడ్చల్, (ఆంధ్రజ్యోతి ప్రతినిధి):** పార్లమెంటు ఎన్నికల నేపథ్యంలో మల్కాజిగిరి పార్లమెంట్ పరిధిలోని అసెంబ్లీ నియోజకవర్గాలకు సమన్వయకర్తలను ఆపార్టీ చీఫ్ కేసీఆర్ శనివారం నియమించారు. మేడ్చల్‌కు శంభీపూర్ రాజు, మల్కాజిగిరి నియోజకవర్గానికి నందికంటి శ్రీధర్, కుత్బుల్లాపూర్‌కు గొట్టిముక్కుల వెంగలరావు, కూకట్‌పల్లికి బేతిరెడ్డి సుభాష్‌రెడ్డి, ఉప్పల్‌కు జహంగీర్ పాషా, కంటోన్మెంట్‌కు రావుల శ్రీధర్‌రెడ్డిని నియమించారు.

● **ఘట్‌కేసర్ రూరల్:** మెరుగైన సమాజస్థాపనకు మీడియా నిరంతరం కృషిచేయాలని టైమ్స్ అఫ్ ఇండియా ప్రతినిధి సుధాకర్‌రెడ్డి అన్నారు. అంకుషాపూర్‌లోని తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల మహిళా డిగ్రీ కళాశాల (ఇబ్రహీంపట్నం)లో శనివారం 'మీడియా అక్షరాస్యత-తప్పుడు సమాచారం' అనే అంశంపై జరిగిన కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు.

● **తాండూరు:** లింగ బలిజ సంఘం పేరిట కొంత మంది కొత్త కార్యవర్గాన్ని ఏర్పాటు చేసి వీరశైవ సమాజాన్ని తప్పుదోవ పట్టిస్తున్నారని సమాజం అధ్యక్షుడు బస్వరాజ్, ప్రధాన కార్యదర్శి లింగదల్లి రవికుమార్ ఆరోపించారు. కొత్తగా ఏర్పాడిన సంఘం, వీరశైవ సమాజానికి ఎలాంటి సంబంధం లేదని శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

● మేడ్చల్ టౌన్: మేడ్చల్ మున్సిపల్ పరిధిలోని 23వ వార్డులో స్థానిక కౌన్సిలర్ కొడె మహేష్ ఆధ్వర్యంలో ఇఫ్తార్ విందును ఏర్పాటు చేశారు.

● **ఘట్‌కేసర్ రూరల్:** వెంకటాపూర్ నీలిమా ఆసుపత్రిలో ప్రపంచ ఆరోగ్య దినోత్సవం సందర్భంగా శనివారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆసుపత్రి సీఈవో సూర్యదేవర నీలిమా పలు ఆరోగ్య సూత్రలను వివరించారు. ఈ కార్యక్రమంలో వైద్యులు సురేందర్, గిరిధర్‌రెడ్డి, ప్రతినిధులు చెన్నకేశ మల్లేష్, ఎండ్ల భరత్‌రెడ్డి పాల్గొన్నారు.

● **తాండూరు:** చైతన్య ఉన్నత పాఠశాలలో ప్రభుత్వ సూచన మేరకు ఉదయం 9 గంటలకు వాటర్‌బెల్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ విధంగా తాండూరు నియోజకవర్గంలో చాలా పాఠశాలల్లో శనివారం నుంచి వాటర్ బెల్ కార్యక్రమాన్ని అమల్లోకి తీసుకొచ్చారు.

● **బొంరాస్‌పేట్:** బాపల్లి ప్రాథమిక పాఠశాలలో శనివారం హెల్త్ క్లస్టర్ కరుణావతి, ఆశావర్కర్లు శనివారం గ్లూకన్ డీ ప్యాకెట్లు, విరేచనాల నివారణ మాత్రలు, జ్వరం కోసం పారాసిటమాల్ మాత్రలు పంపిణీ చేశారు.

● **పెద్దేముల్:** జాగోబంజార సమాజ్ ఆధ్వర్యంలో నిర్వహించతలపెట్టిన భారత్‌బంజారా ధర్మరక్షణ జాగృతి సందేశ్‌సభను విజయవంతం చేయాలని జాగోబంజార సమాజ్ వ్యవస్థాపకులు సురేందర్ నాయక్‌మహారాజ్, రమావత్ శాంతదేవి అన్నారు. కందనెల్లితండా సమీపంలోని యాడీబాపుగడ్ దేవస్థాన్ ఆధ్యాత్మిక కేంద్రం సమీపంలో ఈనెల 17న శ్రీరామనవమిని పురస్కరించుకుని సందేశ్‌సభను ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు.

● **కీసర:** ఎంపీవో నంద కిషోర్ అధ్వర్యంలో శనివారం కీసర గ్రామ పంచాయతీ కార్యాలయంలో తైబజార్ వేలం నిర్వహించారు. కీసరకు చెందిన చిక్కుడు వెంకటేష్ రూ.3లక్షలా 34వేల 550లకు తైబజార్‌ను దక్కించుకున్నాడు. అధికారులు తెలిపిన నియమ నిబంధనల మేరకు నగదు చెల్లించాలని, అధిక ధరలు వసూలుచేస్తే చర్యలు తీసుకుంటామని ఎంపీవో నందకిషోర్ ఈ సందర్భంగా తెలిపారు.

క్రైం కార్నర్

కడుపునొప్పి భరించలేక యువతి ఆత్మహత్య

పెద్దేముల్, ఏప్రిల్ 6: కడుపునొప్పి భరించలేక యువతి ఆత్మహత్య చేసుకున్న ఘటన పెద్దేముల్ మండలం మన్‌సాన్‌పల్లి గ్రామంలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని మన్‌సాన్‌పల్లి గ్రామానికి చెందిన అంజు(18) ఇటీవలే ఇంటర్ పూర్తిచేసింది. ఆమె కొన్ని రోజులుగా తీవ్ర కడుపునొప్పితో బాధపడుతోంది. శుక్రవారం సాయంత్రం కడుపునొప్పి వస్తోందని కుటుంబ సభ్యులతో చెప్పి ఇంట్లో విశ్రాంతి తీసుకుంది. కుటుంబసభ్యులు అందరూ నిద్రించాక ఇంట్లో ఫ్యాన్‌కు ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. ఉదయం గమనించిన కుటుంబసభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో పోలీసులు శవపంచనామా నిర్వహించారు. యువతి తండ్రి లక్ష్మణ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ గిరి తెలిపారు.

అదనపు కట్నం వేధింపులు.. భార్య నిరసన

ఘట్‌కేసర్, ఏప్రిల్ 6: అదనపు కట్నం కోసం వేధిస్తూ భార్యను కాపురానికి తీసుకురాకుండా వేధిస్తున్నాడు. దీంతో భర్త తీరును నిరసిస్తూ భార్య తన కూతురుతో కలిసి ఆందోళనకు దిగింది. ఆమెకు స్థానికులు అండగా నిలిచారు. వివరాల్లోకి వెళ్తే.. ఘట్‌కేసర్ మున్సిపాలిటీలోని ఎన్ఎఫ్‌సీనగర్‌కు చెందిన రామిడి విష్ణువర్ధన్‌రెడ్డికి యాదాద్రి భువనగిరి జిల్లా బీబీనగర్ మండలం బ్రాహ్మణపల్లికి చెందిన రాధికతో 2021లో వివాహమైంది. వివాహ సమయంలో 40తులాల బంగారం, కిలో వెండి, అరఎకరం భూమి, రూ.10లక్షల నగదును ఇచ్చారు. ఆరునెలల పాటు వారి సంసారం సవ్యంగానే సాగింది. భర్త అదనపు కట్నం కోసం వేధించడం మొదలుపెట్టాడు. దీంతో భార్యాభర్తల మధ్య తరచూ గొడవలవుతున్నాయి. ఈలోపు రాధిక ఆడబిడ్డకు జన్మనిచ్చింది. దీంతో విష్ణువర్ధన్ రెడ్డి వివాహ సమయంలో ఇస్తామన్న అర ఎకరం భూమిని అమ్మి డబ్బులు తీసుకొని రావాలని వేధించాడు. ఈవిషయాన్ని రాధిక తల్లిదండ్రులకు చెప్పడంతో వారు పెద్దమనుషుల సమక్షంలో మాట్లాడినప్పటికీ ఫలితం లేకపోవడంతో భర్తపై రాధిక పోలీసులకు ఫిర్యాదు చేసింది. అయినా ఫలితం లేకుండా పోయిందని వాపోయింది. తన అన్న పోలీసు అని, బావ న్యాయవాది అని, తమకు రాజకీయ నాయకుల అండదండలున్నాయంటూ తన భర్త బెదిరిస్తున్నాడని రాధిక ఆవేదన వ్యక్తం చేసింది. విషయం తెలుసుకున్న పోలీసులు, స్థానికులు పెద్దఎత్తున గుమిగూడారు. అప్పటికే ఇంటికి తాళం వేసుకొని అత్తామామ వెళ్లిపోవడంతోట తాళం పగులగొట్టి రాధిక తన కూతురుతో ఇంట్లోకి వెళ్లింది. ముందు జాగ్రత్త చర్యగా పోలీసులు భద్రత ఏర్పాటు చేశారు.

తాండూరులో మహిళ దారుణ హత్య

తాండూరు, ఏప్రిల్ 6: పట్టణంలోని బీసీ శ్మశానవాటికలో ఓ వివాహిత దారుణహత్యకు గురైంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మహబూబ్‌నగర్ జిల్లా కోస్గి మండలం గుండుమల్ గ్రామానికి చెందిన తిరుపతమ్మ(40) 25ఏళ్ల కిందట కోస్గి మండలం ముశ్రీఫా గ్రామానికి చెందిన హనుమంతుతో పెళ్లి జరగగా పిల్లలు పుట్టకపోవడంతో 10సంవత్సరాల కిందట భర్త ఆమెను వదిలేశాడు. అప్పటి నుంచి ఆమె తన తల్లి ఇంట్లో ఉంటోంది. రెండు నెలల కిందట తిరుపతమ్మ తాండూరులోని సాయిపూర్‌లో తన అక్క సుజాత ఇంట్లోఉంటూ పలు ఇళ్లల్లో వంట మనిషిగా పనిచేస్తోంది. రోజూలాగే శుక్రవారం కూడ పనికి వెళ్లే తిరుపతమ్మ తిరిగి ఇంటికి రాకపోవడంతో అక్క సుజాత ఆమె ఆచూకీ కోసం వెతికినా ప్రయోజనం లేకుండా పోయింది. ఈ క్రమంలో శనివారం తిరుపతమ్మ మృతదేహాన్ని గుర్తించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. విషయం తెలుసుకున్న సుజాత తన అక్కను ఎవరో హత్యచేసి చంపారని తాండూరు పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు డీఎస్పీ బాలకృష్ణారెడ్డి తెలిపారు. జిల్లా క్లూస్‌టీం, పోలీసు జాగిలాలు పరిశీలించారు. లైంగికదాడి చేసి హత్య చేశారా? అనే విషయమై మెడికల్ రిపోర్టులు వచ్చాక తెలుస్తుందన్నారు. ఎవరు చేశారు? ఎందుకు చేశారు? అనే విషయాలపై సమగ్ర దర్యాప్తు చేస్తున్నట్లు తాండూరు డీఎస్పీ బాలకృష్ణారెడ్డి వెల్లడించారు.

బాలికపై ఆటోడ్రైవర్ లైంగిక దాడి

● నిందితుడి రిమాండ్

తాండూరు రూరల్, ఏప్రిల్ 6: బాలికపై లైంగిక దాడికి పాల్పడిన ఆటో డ్రైవర్‌ను పోలీసులు అరెస్టు చేసి శనివారం రిమాండ్‌కు తరలించారు. రూరల్ సీఐ అశోక్, కరన్‌కోట్ ఎస్ఐ విఠల్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని ఐనెల్లి గ్రామానికి చెందిన అంబేష్(31) ఆటో నడుపుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ఇటీవల పదో తరగి పరీక్షలు జరుగగా, చుట్టుపక్కల గ్రామాల నుంచి పరీక్ష రాసేందుకు వచ్చే విద్యార్థులను తీసుకెళ్లేవాడు. ఈ క్రమంలో మండలంలోని ఓ గ్రామానికి చెందిన బాలిక(17) పదోతరగతి సప్లిమెంటరీ పరీక్షలు రాసేందుకు తోటి విద్యార్థులతో కలిసి అంబేష్ ఆటోలో వెళ్లివచ్చేది. అంబేష్ విద్యార్థులతో సన్నిహితంగా మాట్లాడుతూ బాలికతో పరిచయం పెంచుకున్నాడు. పరీక్షలు ముగిసిన తర్వాత ఆ బాలిక ఈనెల 4వ తేదీన తన స్నేహితులతో కలిసి తాండూరులో జరిగిన తన స్నేహితురాలి వివాహ వేడుకల్లో పాల్గొంది. బాలికపై దురుద్దేశంతో అంబేష్ కూడా ఆ వివాహానికి వచ్చాడు. పెళ్లి తర్వాత సాయంత్రం బాలిక తిరిగి ఇంటికి వెళ్తుండగా తన ఆటోలో ఇంటి వద్ద వదిలిపెడతానని నమ్మబలికాడు. ఆటో ఎక్కిన బాలికను బలవంతంగా ఐనెల్లి శివారులోని ఉన్న కంది పంట పొలంలోకి తీసుకెళ్లాడు. అరిస్తే చంపేస్తానని బెదిరించి బాలికపై అఘాయిత్యానికి పాల్పడ్డాడు. బాలికను రాత్రంతా తనవద్దనే పెట్టుకుని ఇంటికి పంపాడు. ఈవిషయం కుటుంబీకులకు చెబుతుందని 5వ తేదీన ఉదయం 5గంటలకు ఆటోలో తాండూరు రైల్వేస్టేషన్ తీసుకెళ్లి రైలు ఎక్కించాడు. ఆ బాలిక ఎలాగోలా తప్పించుకుని జరిగిన విషయాన్ని తన అమ్మ, అమ్మమ్మకు వివరించింది. బాలిక తల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ అశోక్ తెలిపారు. నిందితున్ని అదుపులోకి తీసుకుని రిమాండ్‌కు తరలించినట్లుకరన్‌కోట్ ఎస్ఐ విఠల్‌రెడ్డి చెప్పారు.

అక్రమ నిర్మాణాల కూల్చివేత

మేడ్చల్ టౌన్, ఏప్రిల్ 6: పట్టణంలోని జాతీయ రహదారికి ఆనుకుని అక్రమంగా నిర్మించిన షెడ్లను మేడ్చల్ మున్సిపల్ అధికారులు శనివారం కూల్చివేశారు. మేడ్చల్ ఎమ్మెల్యే, మాజీమంత్రి మల్లారెడ్డి తనయుడు చామకూర మహేందర్‌రెడ్డికి సంబంధించిన స్థలంలో సుప్రవైన్స్ స్థలంలో నిబంధనలకు విరుద్దంగా షెడ్లు వేసి సిట్టింగ్ రూమ్ ఏర్పాటు చేశారు. అక్రమ నిర్మాణాలపై వారం రోజుల కిందట సంబంధిత వైన్స్ నిర్వాహకులకు నోటీసులు ఇచ్చినప్పటికీ వారు స్పందించకపోవటంతో శనివారం షెడ్లను కూల్చివేసినట్లు అధికారులు తెలిపారు. రాజకీయ కక్షల కారణంగా నిర్మాణాలను కూల్చివేశారని వైన్స్ యజమాని రాజమల్లారెడ్డి ఆరోపించాడు. తమకు కనీస సమయం ఇవ్వలేదని వాపోయాడు. ఈ నిర్మాణాలు ముమ్మాటికీ అధికార బలంతో గతంలో బీఆర్ఎస్ హయాంలో నిర్మించినవని ఫిర్యాదు దారులు ఆరోపించారు. రోడ్డు సమీపంలో ఎలాంటి అనుమతి లేకుండా షెడ్లు నిర్మించటంతో తగిన విచారణ జరిపి నిర్మాణాల యజమానులకు నోటీసులు జారీ చేసిన అనంతరం కూల్చివేశామని మున్సిపల్ అధికారులు తెలిపారు. ఇందులో ఎలాంటి రాజకీయ ప్రమేయం లేదని, నిబంధనల ప్రకారం నిర్మాణాలను తొలగించామని అధికారులు తెలిపారు.

బాలుడిని సిమ్మింగ్‌పూల్‌లో ముంచి హత్యాయత్నం

● ఇద్దరిపై కేసు నమోదు ● ఆలస్యంగా వెలుగులోకి వచ్చిన ఘటన

ఘట్‌కేసర్ రూరల్, ఏప్రిల్ 6: బాలున్ని స్విమ్మింగ్ పూల్‌లో ముంచి హత్యాయత్నానికి పాల్పడిన ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు సీఐ సైదులు తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. బీహార్‌కు చెందిన ఓ కుటుంబం ఇటీవల ఘట్‌కేసర్‌కు వలస వచ్చి కూలి పనులు చేసుకుంటున్నారు. వారి కుమారుడు(బాలుడు) పాఠశాలకు సెలవు ఉన్నప్పుడల్లా స్థానిక ఫ్లవర్‌షాప్‌లో పనిచేసేవాడు. అయితే బాలుడు గత ఫిబ్రవరి నుంచి షాపులో పనికి వెళ్లలేదు. దీంతో షాప్ యజమాని రఫీక్, అతడి స్నేహితుడు ఇంతియాజ్‌లు కలిసి బాలున్ని తీసుకొని కొండాపూర్‌లోని సిమ్మింగ్‌పూల్‌కు వెళ్లారు. అక్కడ స్విమ్మింగ్ చేస్తుండగా బాలున్ని రఫీక్, ఇంతియాజ్‌లు నీళ్లలో ముంచుతూ ఊపిరి ఆడకుండా చేశారు. అంతటితో ఆగకుండా ఇంతియాజ్ బాలుడి గొంతుకు తాడుచుట్టి నీళ్లలో ముంచాడు. సిమ్మింగ్‌పూల్‌లో బాలుడిపై చేస్తున్న సన్నివేశాలను సెల్‌ఫోన్‌లో చిత్రీకరించి పైశాచిక ఆనందాన్ని పొందారు. బయట ఎవరికైనా చెబితే చంపేస్తామని బాలున్ని బెదిరించారు. గతంలో వారు సెల్‌ఫోన్‌లో తీసిన సన్నివేశాలను శనివారం సాయంత్రం బాలుడి తల్లికి పంపారు. దీంతో తల్లి పోలీసులను ఆశ్రయించి ఫిర్యాదు చేసింది. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.